# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-03-2026 సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి దోహదపడేలా వేగవంతమైన వాణిజ్య విధానాలపై దృష్టి సారించాలని కలెక్టర్లకు సూచించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **ఏపీజెన్‌కో 6 వేల 101 మెగావాట్లతో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసిందని వెల్లడించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.**

3. **సాగర్ డిఫెన్స్ అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ సిస్టమ్స్ కేంద్రాన్ని నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమన్న మంత్రి పి.నారాయణ.**

4. **మూత్రపిండాల వ్యాధులపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ రోజు ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి దోహదపడేలా వేగవంతమైన వాణిజ్య విధానాలపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లుకు సూచించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రెండోరోజు కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. సమావేశంలో ఈ రోజు సూపర్ సిక్స్, సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల అంశాలపై ముఖ్యమంత్రి చర్చిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, విశాఖపట్నం , అమరావతి, తిరుపతి నగరాలను ఆర్థిక అభివృద్ధి ప్రాంతాలుగా మార్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించేలా జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. పెట్టుబడులు వస్తే, పరిశ్రమలు ఏర్పాటై స్థానికంగా యువతకు ఉపాధి లభించి ప్రజల తలసరి ఆదాయం పెరుగుతాయని చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,

వాయిస్ ..30 .. సెకన్లు

--------------------------

అమరావతిలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సు రెండవ రోజు సమీక్షలో భాగంగా సంజీవని ప్రాజెక్టు, వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలుపై వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సహకారంతో సంజీవని ప్రాజెక్టు అమలు జరుగుతోందని తెలిపారు. ఈ వేదిక ద్వారా కృత్రిమ మేధ –ఎఐ ఆధారిత రోగనిర్ధారణ విధానంతో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. అలాగే మెడ్‌టెక్ పోర్టల్ సహాయంతో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని జిల్లాల్లో

వాతారవరణ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, ఆయా జిల్లాల కలెక్టర్లు స్థానిక పరిస్థితులను సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సౌరబ్ గౌర్ సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ – ఏపీజెన్‌కో 6 వేల 101 మెగావాట్లతో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఈ మేరకు విద్యుదుత్పత్తిపై సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా మంత్రి ఈ రోజు స్పందిస్తూ, ఇంజినీర్లు, అధికారుల అంకితభావం, నైపుణ్యం కృషితోనే ఈ రికార్డు నమోదైందని చెప్పారు. వేసవి విద్యుత్ అవసరాలకు అనుగుణంగా అధిక స్థాయిలో విద్యుదుత్పత్తిని కొనసాగించడం కీలకమన్నారు. గృహ, పారిశ్రామిక, వ్యాపార సంస్థలకు నిరంతరాయ విద్యుత్ సరఫరాయే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

సాగర్ డిఫెన్స్ అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ సిస్టమ్స్ కేంద్రాన్ని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ ఈరోజు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని జువ్వలదిన్నేలో ఏర్పాటు కానున్న సాగర్ డిఫెన్స్ ప్రాజెక్టుపై ఆయన మాట్లాడుతూ, భారతదేశ స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యాన్ని ఈ ప్రాజెక్ట్ మరింత బలోపేతం చేయనుందని పేర్కొన్నారు. సముద్ర సాంకేతికతలో నూతన ఆవిష్కరణలకు దారి తీస్తూ, మత్స్యకార రంగం, పారిశ్రామిక నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడనుందని తెలిపారు. తీర ప్రాంత పర్యవేక్షణ, భద్రత, రక్షణ సిద్ధతను మరింత బలపరచడంలో సాగర్ డిఫెన్స్ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈ రోజు విశాఖపట్నం జిల్లాలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు పలు సమస్యలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకురాగా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అన్నివిధాలా అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు.

---------------------------

పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ పథకం మూడవ విడత నిధులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు కృష్ణాజిల్లాలో నిర్వహించే కార్యక్రమంలో విడుదల చేస్తారని గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకటరావు తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామం సమీపంలోని మాదలవారి గూడెంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, అస్సాంలోని గౌహతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కిసాన్ నిధులను విడుదల చేసిన అనంతరం, ముఖ్యమంత్రి పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధులను విడుదల చేస్తారని ఆయన తెలుపుతూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

మూత్రపిండాల వ్యాధులపై అవగాహన కల్పించి, ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో ఈ రోజు ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా 2006 నుంచి ఏటా మార్చి నెలలో రెండవ గురువారం దీనిని జరుపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మందిలో ఒకరు దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు చెపుతున్నాయి. ఈ నేపథ్యంలో మూత్రపిండాల వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు పలు అవగాహనా ప్రచారాలు, కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

మానవ శరీర జీవ క్రియల్లో మూత్రపిండాలు కీలక పాత్ర పోషిస్తాయని శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ పి. భానుమూర్తి తెలిపారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ, ప్రాధమిక దశలో మూత్రపిండాల వ్యాధి గుర్తిస్తే నివారించవచ్చని తెలిపారు. తక్కువ ఉప్పు, సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా మూత్రపిండాల వ్యాధి రాకుండా నివారించుకోవచ్చని ఆయన తెలియజేస్తూ,

వాయిస్..30. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని భారతీయ రిజర్వ్ బ్యాంకు – ఆర్బీఐ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అభిషేక్ కుమార్ కోరారు. ఆర్బీఐ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా – ఎంఎస్ఎంఈ ప్రోత్సాహక పథకాల అవగాహన కార్యక్రమంలో అభిషేక్ కుమార్ నిన్న పాల్గొని మాట్లాడుతూ, ఆహార శుద్ధి కేంద్రాలు, పరిశ్రమల స్థాపనకు రుణాలతో పాటు రాయితీలను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంఎస్ఎంఈ కేంద్రాల ఏర్పాటులో ఆర్బీఐ తరపున అవసరమైన సాంకేతిక సలహాలు, సహకారం అందిస్తామని తెలిపారు.

---------------------------

గిరిజన మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు జీవనోపాధి కార్యక్రమాలను అమలు చేయనున్నామని పార్వతీపురం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ–ఐటీడీఏ ప్రాజెక్ట్ పర్యవేక్షకులు సి. యశ్వంత్ కుమార్ రెడ్డి ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు.

=====================